# పల్లే పాటా

మాట్లాడాలని మొట్టమొదట ఆలోచన వచ్చిన మానవుడెవరో గానీ మహానుభావుడే. ప్రత్యేకంగా గుర్తించడానికి వీలుగా ఎవరో ఒక స్త్రీ లేదా ఒక పురుషుడు మాట్లాడడం మొదలు పెట్టలేదని అనిపిస్తుంది. చప్పుడు చేస్తూ వాటికే అర్థాలు వెతుక్కుంటూ కొంత కాలం గడిచి ఉంటుంది. ఆ తర్వాత ఫలానా రకంగా చప్పుడు చేస్తే ఫలానా అర్థం అని రూఢి అయ్యుంటుంది. ఇటువంటి సంగతులను గురించి పరిణామ పరిశోధకులు, భాషా శాస్త్రవేత్తలనిడిగితే మరిన్ని విశేషాలు చెపుతారు. సరిగానూ తప్పులతోనూ మొత్తానికి అందరమూ మాటలాడుతూనే ఉన్నాము. పాట విషయానికి వచ్చే సరికి పరిస్థితి కొంచెం మారుతుంది. ఒకరికొకరు సమాచారం చెప్పుకోవాలి గనుక మాటలవసరమయినాయి. మరి పాట అవసరం ఎందుకు కలిగినట్టు? అసలు పాడాలని ఆలోచన ఎందుకు కలిగినట్లు?

ఈ ప్రశ్నకు జవాబు ఎలాంటిదయినా పాటలేనిదే బతుకు గడవని రోజులొచ్చాయి. ఇదేమన్నా నిన్న మొన్న మొదలయిన కొత్త పద్ధతనుకుంటే అంత కంటే అన్యాయం ఇంకోటి ఉండదు. ఆదిమానవుడు బొమ్మలు గీస్తే అవి గుహల గోడల మీద మిగిలాయి. వస్తువులు తయారు చేసుకుంటే ఆ సంగతికీ ఆధారాలు దొరికాయి. సంగీత వాద్యం తయారు చేసుకుంటే తెలిసిందేమో గానీ పాట సంగతి మాత్రం తెలియలేదు. పాట గాలిలో కలిసి పోతుంది మరి! అందుకే ముందుగా పాటపాడిన వారి సంగతి తెలియలేదు. అంతే గానీ పాట నిన్న మొన్న పుట్టింది కానే కాదు.

ఇవాళ పాట అనగానే అందరికీ సినిమా గుర్తొస్తుంది. కానీ సినిమా మాత్రం నిన్న వచ్చింది. పాట అంతకు ముందు నుంచి ఉంది. మనిషి ఒంటరి తనం మరిచిపోవడానికి పాట పాడతాడంటారు. భేతాళుడు విక్రమార్కునికి శ్రమ తెలియకుండా ఉండడానికి గాను కథ చెప్పాడంటారు. నిజానికి శ్రమ తెలియకుండా ఉండడానికి పాటను మించిన పద్ధతి లేదు. చివరకో హిందీ సినిమాలో భయమయితే పాటపాడమని అర్థం వచ్చే పాట ఒకటి ఉంది. ఇవన్నీ వెనకటి నుంచి మనిషి ఎటువంటి సందర్భాలలో పాట పాడాడో చెప్పడానికి పనికివచ్చే సంగతులే. సంతోషం, దుఃఖం వస్తే గూడా పాటపాడడం బహుశః సినిమాలలో మాత్రమే జరుగుతుంది. మామూలుగానయితే ఆ రెండు సందర్భాలు తప్పించి మిగతా అన్ని సమయాలలోనూ పాట పాడే అవకాశం ఉంది. పాటకు సంగీతమనే పేరు రాకముందునుంచీ జానపదులు పదాలు పాడుతున్నారు. పాట తీరు తెలియడానికి జానపద సంగీతాన్ని మించిన మార్గం లేదు. పల్లెలు పల్లెలు గానే ఉన్నంత కాలం అక్కడ రకరకాల పాటలు వినబడుతూ ఉండేవి. అందులో భక్తి పాటలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచంలో ఎక్కడయినా మతానికీ సంగీతానికి గట్టి బంధం ఉంటుంది. కానీ మతం కూడా మధ్యలో వచ్చింది. మిగతా పాటలన్నీ పాతకాలంనుంచి వస్తున్నవే.

పల్లె లో తెల్లవారింది మొదలు మధ్యరాత్రి దాకా జరిగే ప్రతి పనికి పాటతో సంబంధం ఉండేది. ఇందులో ముఖ్యంగా చెప్పుకో దగినవి వ్యవసాయం పాటలు. కష్టించి పని చేసేటప్పుడు శ్రమ తెలియకుండా పాటలుండేవి. చేసే పనికి ఒక లయ ఉంటుంది. పాటకూ అదే లయ ఉండే సరికి పని ఒక క్రమంలో జరుగుతూ పోయేది. ఇప్పుడంటే కరెంటు పంపులొచ్చి చూస్తుండగా భూమిలో చుక్క నీరు లేకుండా తోడేస్తున్నాయి గానీ, సరిగ్గా ఇరవయి ముప్ఫయి సంవత్సరాల కింద మనిషి కష్ట పడి తన పశువులకూ తనకూ కాళ్లరిగిందాకా వెనకకూ ముందుకూ కదిలితేనే గానీ పంటకు పదునందేది కాదు. పల్లెల్లో మంచినీటి పథకాలంటూ నల్లాలు వచ్చింతర్వాత చేదుడు బావి మీద మోట గురించే పిల్లలకు తెలియని కాలమిది. ఇక పంటపొలంలో బావి, దానికొక మోట ఉండేదని చెప్పినా కొంత మంది కుర్రవాళ్లకు తెలియదేమో. పంటకు నీరు పెట్టవలసిన రైతులు

తెల్లవారుఝామునే ఎద్దులను తోలుకుని బావి దగ్గరకు చేరుకుంటారు. చిన్న కమతమయితే రైతు తప్పకుండా ఒంటరిగా ఉంటాడు. ఒకే బావిమీద రెండు మూడు మోటలుంటే తోడుగా మరో మనిషి కనబడుతుంటాడు. ఎద్దులను కట్టి తాటి సాయంతో బొక్కెన బావిలోకి దించడం, నీళ్లు పైకి రావడం మళ్లా బొక్కెన దిగడం అంతా నెమ్మదిగా జరుగుతుంది. అన్ని పనులూ క్షణాల్లో జరిగి పోవాలనుకునే ఈ ఇన్‌స్టాంట్ కాలం వారికి ఆ పనిలో ఉండే నెమ్మది తనం అర్థం కాదు. పల్లె బ్రతుకులో పాట అక్కడ మొదలయ్యేది. తెల్లవారుఝామున నిద్ర లేచిన వారికి దూరంగా ఏదో బావి దగ్గర మోటగొడుతూ రైతు పాడుతుండే పాట సుప్రభాతంలా వినిపించేది. మోట నెమ్మదిగా నడుస్తుంది. అట్లాగే ఆ పాటా నెమ్మదిగానే నడుస్తుంది. ఒంటరిగా ఉంటారు. నిద్రపోవలసిన సమయం. హుషారుగా ఉండాలి గనుక మోట పాటల్లో బాగా బూతులుండేవి.

ఇక వ్యవసాయంలో నాట్లకు పాట, కలుపుకు పాట, కోతకు పాట, నూర్పిళ్లకు పాట. ప్రతి పనిలోనూ ఒక లయ. పాటకూ అదే లయ. ఈ పనులన్నీ ఆడంగులే చేస్తారు. కనుక అందుకు సంబంధించిన పాటలూ వాళ్లే పాడతారు. అందుకే ఈ పాటల్లో మాత్రం బూతు తప్ప మిగతా ప్రాపంచిక విషయాలన్నీ ఉండేవి. రాజుల కథలనుంచి మొదలు ఆడపుట్టుకతో వచ్చిన కష్టాల దాకా ఎన్నెన్నో పాటలు. ఇంటికి తెచ్చుకున్న ఫలసాయాన్ని దంచుకునేందుకు పాట. ఇసురుకునేందుకు పాట. వ్యవసాయం మొదలయిన కాడినుంచి కంచంలోకి ముద్దవచ్చే దాకా పాటలే పాటలు.

ఇక జీవితంలోని ప్రత్యేక సందర్భాలకు సంబంధించిన పాటలను గురించి వేరుగా చెప్పుకోవాలి. అందులో పెండ్లి పాటలకున్న ప్రాముఖ్యం మరింత బాగా అందరికీ తెలిసుండాలి. పల్లెల్లో కూడా పెండ్లి గంటల వ్యవహారంగా మారి పోయింది. కానీ మా చిన్నతనంలో అది పదిహేను రోజుల కార్యక్రమం. అంతా ఆటపాటలతో అంగరంగవైభోగంగా జరిగేది. పెండ్లి కొట్నం అనే కార్యక్రమంతో మొదలవుతుంది. ఇప్పటికీ కొంత మంది ఈ పద్ధతి పాటిస్తున్నారు. ఉలూఖల ముసల దేవతారాధనం అంటే రోలు రోకలికి పూజ. ఇందులో గల ప్రతీక వాదం గురించి చెప్పుకోవలసింది చాలానే ఉంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా పాటలున్నాయి. వధూవరులను పీటల మీదకు పిలవడానికి పాట, నలుగు పెట్టి తలంటు స్నానం చేయించడానికి పాట. ఇలా పెండ్లిలో కదిలితే పాట మెదిలితే పాట అన్న పద్ధతిగా ఉండేది. భోజనాలప్పుడు బువ్వంబంతుల పాటలని పాడే వారు. ఇట్లా తంతుల ప్రకారం పాడుతున్న పాటలు చాలక ప్రతి నిత్యం సాయంత్రం ఊట్నీ అని ఒక కార్య క్రమం పెట్టే వారు. ఇందులో తంతుకు పెండ్లికీ అంత సంబంధం లేదనే చెప్పాలి. కేవలం సరదా కోసం వధూవరులను కూచోబెట్టి అలంకారాలు పసుపు కుంకుమలూ చేసి ఆ తర్వాత తీరికగా పాటల కార్యక్రమం కొనసాగేది. కొన్ని ప్రాంతాలలో మేజువాణీలు బోగం మేళాలు ఉండేవి. కలవారయితే ఘనంగా సంగీత కచ్చేరీలు పెట్టించే వారు. ఆ రెండు పద్ధతులూ తెలియని ప్రాంతాలలో ఇదొకటే పెండ్లిలో సరదా మరి.

ఇంతకంటే చిత్రంగా వినిపించే సంగతి మరొకటి ఉంది. దాన్ని పాట అనవచ్చునో లేదో తెలియదు గానీ ఎవరయివా పోతే కూడా ఆ ఏడుపు ఇంచు మించు పాట లెవెల్లో సాగేది. ఉత్తరభారతంలో కిరాయి పుచ్చుకుని ఏడ్చే వారి గురించి విన్నాము. ఇక్కడ ఎవరూ ఏ కిరాయా ఇన్నకుండానే కేవలం అభిమానం కొద్దీ గంటల తరబడి దీర్ఘాలు తీస్తూ పాటను మించిన శోకాలు తీయడం చాలా మందికి తెలుసు. చచ్చిన మనిషి జీవిత విశేషాలే ఆ పాటకు సాహిత్యం. దానికో విచిత్రమయిన బాణీ. అదే పనిగా ఏడుస్తుంటే గొంతు ఆరిపోతుంది గనుక మధ్యలో ఊపిరి తీసుకోవడానికన్నట్లు ఓ విచిత్రమయిన అంతరాయం.

తెలిసిన వారికిందులో విచిత్రం లేదు గానీ అన్ని చోట్లా పాట తీరు మారిపోయిందంటే అర్థమేమిటో తెలియని వారూ కొందరున్నారు మరి!!